# రష్యన్ సీత

కస్టమ్స్ క్లియరెన్సు పూర్తయి బైటికొచ్చిన ప్రదీప్‌ని చూడగానే పరుగెత్తుకుని వెళ్ళి, రెండు చేతులతో అతని మెడని చుట్టేసి ముద్దెట్టుకుంది లేనియా. భుజానికి తగిలించుకున్న ఎయిర్‌బేగ్‌ని, చేతిలోని సూట్‌కేస్‌ని నేలమీద పెట్టి లేనియాని కౌగిలించుకుని కిస్ ఇచ్చాడు ప్రదీప్.

"ప్రదీప్! ఈ నెల్లాళ్ళూ ఎంత దుర్భరంగా గడిచాయో తెల్సా? నీవులేని జీవితం వ్యర్థమని, నువ్వులేందే బతకలేననితెలుసుకున్నాను. నీ రాకకోసం ఎంతగా ఎదురుచూసానో ఎలా చెప్పను? నిమిషమొక యుగంలా గడిచిందనుకో" అంటూ రష్యన్‌లో చెప్పుకుపోతోంది లేనియా. ఇద్దరూ కలిసి బైటికొచ్చి టాక్సీ ఎక్కారు. మాస్కోలో నుంబా యూనివర్సిటీకి తీసుకెళ్ళమన్నారు.

హాస్టల్ రూంలోకి వెళ్ళగానే పెట్టె తెరిచి లేనియా కోసం భారతదేశం నుంచి తెచ్చిన కానుకలన్నీ ఇవ్వసాగాడు. అందమైన రుమాళ్ళు, గాజులూ, వాల్ డెకరేషన్లు, ఒక చీర, రవికా కూడా తెచ్చాడు. అవన్నీ చూసి లేనియా మురిసిపోసాగింది. ప్రతీ వస్తువునీ గుండెలకి హత్తుకుంటూ, పొగుడుతూ, మధ్య మధ్య అతన్ని ముద్దులతో ముంచెత్తుతోంది లేనియా.

ప్రదీప్ భారతదేశంలో బి.యస్‌సి గోల్డు మెడలిస్టు. ఎమ్.ఎస్సీ చెయ్యడానికి రష్యా వెళ్లాడు. ఎమ్.ఎస్సీ కూడా మంచి మార్కులతో పాసయి అక్కడే పిహెచ్.డి. చేయాలని నిశ్చయించుకున్నాడు.

మాస్కోకి వెళ్ళిన కొద్దిరోజులకే ఆతనికి తన క్లాస్‌మేట్ లేనియాతో పరిచయమయింది. ఇద్దరూ ఒకే హాస్టల్‌లో వుండే వారు. కలిసి తిరిగేవారు. లేనియాకి ప్రదీప్ అంటే చాలా ఇష్టం. అతని రంగు ఆమెకి మరీ ఇష్టం. తెల్లటి తమ దేశీయుల్ని చూసి చూసి విసిగిపోయిన లేనియాకి చామనఛాయగా ఉన్న ప్రదీప్ అంటే అమితమైన ప్రేమ. అతన్ని ప్రతీ నిమిషం "ఎంత అందంగా వుంటావు ప్రదీప్! నీ రంగు రావాలంటే నేనేం చెయ్యాలి? సమ్మరంతా సోచీకి వెళ్ళి సముద్రపు ఒడ్డుని సన్‌బాత్ తీసుకున్నా నీలా నల్లబడలేదు" అంటూ వాపోయేది.

రానురాను ప్రదీప్ కూడా లేనియాపట్ల ఆకర్షితుడయ్యాడు. అది ప్రేమగా మారింది. తెల్లటి తెలుపు మంచి యౌవనంలో ఉన్న లేనియా పగలూ, రాత్రీ కూడా తన వెంట తిరుగుతూంటే ప్రదీప్‌లోని పురుషత్వం అతనిచేత ముందడుగు వేయనిచ్చింది. ఇద్దరూ కలిసి చాలా చనువుగా తిరిగేవారు. భారతదేశంలోలాగ ఆడపిల్లల్ని ఏమన్నా అంటే ఎవరైనా లెంపకాయ కొడతారేమో అన్న భయంతో వచ్చిన కొత్తలో ఆమెతో చనువుగా మసలడానికి జంకేవాడు. కానీ లేనియాయే అతి చనువు తీసుకుని అతన్ని రాసుకు పూసుకు తిరగడమే కాకుండా, అప్పుడప్పుడు అతన్ని పొగిడేసి ముద్దులవర్షం కురిపించేది. మొదట అతనికి చాలా సిగ్గనిపించేది.

"భారతదేశంలోని స్త్రీలకి, రష్యన్ స్త్రీలకి మధ్య ఎంత వ్యత్యాసం!" అనుకునేవాడు. తరువాత అతని భయాన్ని తోటి భారతీయ విద్యార్థులు కూడా పారద్రోలి, అక్కడి పద్ధతులు వారి అలవాట్లు మన దేశానికి పూర్తిగా భిన్నమైనవని ఇక్కడ కన్యలతో కలిసి తిరగడం, ముద్దు పెట్టుకోవడం లాంటివి చేస్తే వాళ్ళు అపార్థం చేసుకోరని, తప్పులేదనీ, ప్రతీ విద్యార్థికీ ఓ గర్ల్‌ఫ్రెండ్ వుంటుందని చెప్పారు. అది విన్న మొదట్లో కొంచెం ఆశ్చర్యపోయినా, నెమ్మది నెమ్మదిగా అక్కడి వాతావరణానికి అలవాటుపడి అక్కడ మిగతావారితో కలిసిపోయాడు.

లేనియా ప్రదీప్‌లు కలిసే చదువుకునేవారు. ఆమె తన సమయాన్ని చాలామట్టుకు అతని గదిలోనే గడిపేది. ఎక్కడికెళ్ళినా కలిసే వెళ్లేవారు. అప్పుడప్పుడు అడవుల్లోకి షికారు వెళ్లేవారు. వారి మధ్య ఆడా, మగా అన్న భేదం వుండేదికాదు. లేనియా తల్లిదండ్రులు కూడా ప్రదీప్‌తో తమ కూతురు అంత చనువుగా తిరుగుతున్నందుకు ఎన్నడూ వారించలేదు. పైగా "మా లేనియా బోయ్ ఫ్రెండ్" అని అందరికీ పరిచయం చేసేవారు.

లేనియాకు భారతదేశం అన్నా, భారతీయులన్నా ఎంతో ఇష్టం. ఆమె ప్రదీప్ ద్వారా భారతదేశం గురించి, అక్కడి వింతలూ, విశేషాల గురించి అడిగి తెలుసుకునేది. ప్రదీప్ భారతీయుల ఆచారాలని, అలవాట్లని, పద్ధతులనీ, కట్టుబాట్లనీ చెప్తుంటే ఎంతో ఆసక్తితో వినేది. ముఖ్యంగా భారత స్త్రీల పవిత్రతని గురించి, పతివ్రతల కథలు చెప్తుంటే ఆమె ఎంతో శ్రద్ధగా వినేది. భారతీయుల వివాహ పద్ధతులు, భార్యాభర్తల అనుబంధం గురించీ చెప్పినప్పుడు ఆమె ఆశ్చర్యానికి అంతే లేకుండా పోయింది.

"ప్రదీప్! మీలో పెద్దలు కుదిర్చిన వివాహాలు చేసుకోవడమే కాకుండా, అంతవరకూ అపరిచితులుగా వుండి, ముక్కూ, మొహం తెలియని ఒకరికొకరు ఒక్క మాంగల్యంతో భార్యా భర్తలు కావడం, జీవితాంతం అన్యోన్యంగా జీవించడం ఎంత ఆశ్చర్యకరమైన విషయం! మా పద్ధతులు మీ పద్ధతులకి పూర్తిగా భిన్నమైనవి.

వయసొచ్చిన ఆడపిల్లలు వారి భర్తల్ని వారే వెతుక్కోవాలి. మీలాంటి కట్టుబాట్లు మాకు లేవు. పైగా మేము మా భర్తల్ని వెతుక్కోకపోతే మాలో ఏదో లోపముందని మా తల్లిదండ్రులే మమ్మల్ని డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళి సంప్రదిస్తారు. పెళ్ళికి ముందు ఎంత సన్నిహితంగా తిరిగినా అపవిత్రులమయ్యామని బాధపడరు. అసలు అటువంటి పదమే మాకు లేదు. స్వేచ్ఛగా మా జీవితాన్ని ఆనందంగా అనుభవిస్తాం. పైగా వివాహమయ్యాక మీలో లాగ మాకు విడాకులు తీసుకోవడానికి అంత కష్టపడనక్కరలేదు. అవి కూడా మాకు సులువుగా లభిస్తాయి. విడాకులు తీసుకొన్న తరువాత మళ్లీ వివాహం కూడా చేసుకోవచ్చు. కన్యగా వుండగా మాకు పిల్లలు పుట్టినా మమ్మల్ని ఎవ్వరూ వేలెత్తి చూపరు. ఆ పిల్ల భవిష్యత్తు నాశనమయి పోతుందని బాధపడరు. పైగా అటువంటి పిల్లలకి ప్రత్యేకమైన ఎలవెన్సులు ప్రభుత్వం ద్వారా లభిస్తాయి," అంటూ తమ దేశపు ఆచారాలని పద్ధతుల్ని ప్రదీప్‌కి చెప్పింది.

సమయం దొరికినప్పుడు ప్రదీప్ దగ్గర తెలుగు నేర్చుకునేది. ప్రదీప్ తనకి కష్టపడి నేర్పేవాడు. కష్టపడి నేర్చుకోవడంతో ఏడాదిలోనే పుస్తకం చదవడం వచ్చింది. అతని దగ్గర పుస్తకాలే కాకుండా, ఇంకా అక్కడున్న వారి దగ్గరున్న పుస్తకాలని కూడా తెచ్చి చదివేది. తెలియనివి, అర్థంకానివి ప్రదీప్‌ని అడిగి తెలుసుకునేది. పతివ్రతల కథలు, రామాయణం, భాగవతం వంటివి కూడా వచనాల్లో వున్నవి చదివింది. అదే సమయంలో రష్యన్ బాల బాలికలు రామాయణం బాలే ప్రదర్శించారు. బాలేకు లేనియా, ప్రదీప్‌లు వెళ్ళారు. ఆమెకి ఎంతో నచ్చింది. అక్కడ ఏ ఇండియన్ ప్రోగ్రాములయినా, సినిమాలొచ్చినా తప్పకుండా వెళ్లేవారు. లేనియాకి భారతీయులన్నా, వారి పద్ధతులన్నా వారి కట్టుబాట్లన్నా అమితమైన గౌరవం. వారి ఆచారాలు చాలా నచ్చాయి. ప్రదీప్ నడత, అతని అలవాట్లు నచ్చాయి. తను ప్రదీప్‌ని వివాహమాడి భారతదేశం వెళ్ళి అక్కడి స్త్రీలవలె వుండాలని నిశ్చయించుకుంది. అప్పటినుంచీ ఆమె అతనిపట్ల ప్రత్యేకమైన అభిమానాన్ని పెంచుకోసాగింది.

ఈరోజు తన మనసులోని కోరికలని అతనితో చెప్పింది. "నన్ను వివాహం చేసుకుని మీ భారతదేశానికి తీసుకెళ్లమని" ప్రదీప్‌ని అడిగింది. "తనకీ భారతనారీమణుల్లా చీర కట్టుకుని పవిత్రమైన ఆదర్శ మహిళగా నీతో సంసారం చెయ్యాలని వుంది" అని చెప్పింది. ప్రదీప్ ఒక్కసారిగా తలెత్తి ఆమెని చూశాడు. లేనియా ముఖంలో ఏ కల్మషమూ లేదు. ఎంతో ఆశతో వేడుకుంటున్నట్లుంది ఆ ముఖం. ప్రదీప్‌కి లేనియాపై నిజంగానే జాలి కలిగింది. వెంటనే "అలాగే తప్పకుండా లేనియా" అన్నాడు ఆమెని దగ్గరగా తీసుకుంటూ. లేనియా పరవశంతో అతన్ని అల్లుకుపోయింది.

ఆనాటి లగాయతూ ప్రదీప్ భార్యగా మసలుకునేది.

భారత స్త్రీల గురించి తమ పుస్తకాల్లో చదివినదంతా ఆచరించేది. భారతనారీ మణుల్లా సేవచేసేది.

తన పిహెచ్.డి పూర్తయ్యాకే వివాహం చేసుకుందామనుకున్నాడు.

లేనియా మాత్రం ఆనాటిలగాయతూ అతనితో వివాహం అయిపోయినట్లే భావించేది. ఒక్క మంగళ సూత్రమే కట్టుకోవటము తరువాయి అనుకొనేది. అతన్ని భర్తగా గౌరవించేది. లేనియా తల్లిదండ్రులుకూడా ఎట్టి అభ్యంతరమూ చెప్పలేదు.

లేనియా ఒక్క ప్రదీప్‌తో తప్ప మరే మగవాళ్ళతో చనువుగా మసిలేదికాదు.

అప్పుడప్పుడు “నా పేరు సీత నీ పేరు రాం” అనేది నవ్వుతూ. ప్రదీప్‌తో అక్కడున్న భారతీయుల ఇళ్ళకి వెళ్ళి వారి వంటకాలని తినడం అలవర్చుకుంది. పూర్తిగా భారత స్త్రీలా మారిపోవాలని నిశ్చయించుకుంది.

ప్రదీప్‌కి లేనియాలో వచ్చిన మార్పు ఇబ్బందికరంగానూ, భయంగానూ వుండేది.

మొదట్లో మిగతావారిలా లేనియా కూడ అక్కడున్నన్నాళ్లూ తనతో వుంటుందని, తను తిరిగి స్వదేశానికి తిరిగి వచ్చేశాక ఆమె తోవ ఆమెదీ, తన తోవ తనదీ అని అనుకున్నాడు.

అలా కాకుండా ఆమె భారతదేశపు పద్ధతుల్ని అవలంబిస్తూ తనని పెండ్లాడి తన దేశానికి రావాలని కోరుకుంటోంది. అది ఎంతవరకూ సాధ్యం? పైగా తన తల్లిదండ్రులు, బంధువర్గం తనని బతకనిస్తారా? తన చెల్లెళ్ల పెళ్ళిళ్ళు ! తన కుటుంబ పరువు, మర్యాదా! ఇవన్నీ గంగపాలవవూ? తనకంత సాహసం లేదే?

అసలు తను లేనియాతో ఇలా తిరుగుతున్నట్లు తెలిస్తే తనవాళ్ళు వూరుకుంటారా? అక్కడ తనున్నన్నాళ్ళు లేనియా తన కోరికల్ని తీరుస్తూవుంటుందని వారికదేం తప్పులేదుకదా అని అనుకున్నాడు. అక్కడున్న కొందరు భారతీయ విద్యార్థులు “ఇక్కడ ఆడపిల్లల్ని మన చొక్కాలు మార్చుకున్నంత సులువుగా మార్చుకోవచ్చు” అని జోక్ చేసేవారు.

ఆవే మాటలు ప్రదీప్ మనసులో నాటుకు పోయి లేనియాతో యింత చొరవగా తిరగడానికి కారణమయ్యాయి. అంతేకాకుండా ఇప్పుడు లేనియా తనని ఇతర స్త్రీలతో చనువుగా తిరగనివ్వటం లేదు. డ్రింకులు మానెయ్యమనేది, తనూ మానేసింది.

తన భర్త శ్రీరామచంద్రుడిలా ఉండాలని ఆదేశిస్తోంది.

అక్కడికి వెళ్ళేక ప్రదీప్‌కి అవన్నీ బాగా అలవాటయ్యాయి.

ఇప్పుడు మానెయ్యడం యిబ్బందిగానే ఉంది. కానీ ఏమీ చెయ్యలేకపోతున్నాడు. "సరేలే! నా చదువయి, వెళ్ళిపోయాక నేనెవరో! తనెవరో! ఇప్పుడా ఆలోచనల్తో ఎందుకు బుర్ర పాడుచేసుకోవడం" అనుకున్నాడు.

ప్రదీప్ పిహెచ్.డి. చెయ్యడానికి తిరిగి మాస్కోకివచ్చి నెల దాటింది. అతను పిహెచ్.డి. మాస్కో స్టేట్ యూనివర్సిటీలో చెయ్యసాగాడు.

లేనియా లుమంబా యూనివర్సిటీలోనే పిహెచ్.డి. చెయ్యసాగింది. అయినా రోజూ ఇద్దరూ కలుసుకునేవారు.

ఒకరోజు లేనియా ప్రదీప్ హాస్టల్‌కి వచ్చేది. మరోరోజు ప్రదీప్ ఆమె హాస్టల్‌కి వెళ్లేవాడు. కొంచెంసేపు బైటకీ తిరిగొచ్చేవారు. ఆ తరువాత ప్రదీప్ రూంలోగాని లేనియా రూంలోగానీ ఆ రాత్రి గడిపి మళ్లీ ఉదయం వారి వారి పనులకి వెళ్ళిపోయేవారు.

ప్రదీప్ భారతదేశంనుంచి తెచ్చిన చీరలని కట్టుకుని, నగలని పెట్టుకుని అప్పుడప్పుడు అతనితో అక్కడి భారతీయుల ఇళ్ళకి వెళ్ళేది.

"అచ్చు ఆంధ్రా స్త్రీలా వున్నా" వని అంతా అంటే ఎంతో మురిసిపోయి ఆనందిస్తూ "మరి మీ ఆంధ్రా కోడల్ని కాబోతున్నానుకదా!" అనేది.

అందరితో తను ప్రదీప్‌ని వివాహమాడబోతున్నానని చెప్పేది. వారిద్దరి మధ్య కూడా భార్యాభర్తల అనుబంధం రోజు రోజుకీ పెరగసాగింది.

రోజులు దొర్లిపోతున్నాయి.

సాయంకాలం వస్తానన్న లేనియా రాకపోవడం ప్రదీప్‌కి ఆశ్చర్యంగానూ, ఆందోళనగానూ ఉంది. తను మాస్కోకి వచ్చాక లేనియాతో పరిచయం అయిన తరువాత వస్తానన్న రోజు లేనియా రాకపోవడం, ఆమెని చూడకుండా, కలవకుండా ఉండడం ఇదే తొలిసారి.

రాత్రి ఏడు దాటింది. ప్రదీప్‌కి చాలా అసహనంగావుంది.

"ఏమయింది? ఎందుకు రాలేదు? నిన్న నేను వెళ్ళినప్పుడు ఈరోజు వస్తాను రిసియా థియేటరులో మంచి పిక్చర్ ఆడుతోంది, వెళ్దాం రెడీగా ఉండమని చెప్పిందే! ఎందుకు రాలేదు?" అని తనని తానే ప్రశ్నించుకోసాగాడు.

ఇక ఉండబట్టలేక హాస్టల్ బైటున్న పబ్లిక్‌ఫోన్ దగ్గరికివెళ్ళి రెండు కొపెక్ల కాయిన్‌వేసి లేనియా హాస్టల్‌కి ఫోన్ చేసాడు. లేనియా క్లాస్‌మేటు ఫోన్ ఎత్తి "లేనియా రూంలోలేదని సాయంత్రమే లెనిన్‌గ్రాడ్‌కి వాళ్ళ అమ్మమ్మ దగ్గరికి వెళ్ళిందని, నెల్నాళ్ళదాకా రా" నందని చెప్పింది.

ఆ మాటలు విన్న ప్రదీప్‌కి మతిపోయినట్లయింది. అంత అకస్మాత్తుగా తనతో మాటమాత్రంగానైనా చెప్పకుండా ఎందుకెళ్ళింది? ఏం కారణముండి వెళ్ళింది? అనుకొని ఆమె స్నేహితురాలిని అవే ప్రశ్నలు వేశాడు.

ఆమె నాకేం తెలీదని, చెప్పలేదని, ఉదయంనుంచి ఆమె దల్‌గా ఉందని, కారణం అడిగితే చెప్పలేదని, ఆ తర్వాత పిల్చి లెనిన్‌గ్రాడ్ వెళ్తున్నానని చెప్పిందని చెప్పి ఫోన్ పెట్టేసింది.

అది విన్న ప్రదీప్‌కి మరీ ఆశ్చర్యం కలిగింది. "ఉదయ మనగా ఊరికెళ్దామని నిశ్చయించుకున్న లేనియా, తనని కలవకుండా, కనీసం ఫోనయినా చెయ్యకుండా ఎందుకెళ్ళింది? ఎందుకిలా చేసింది?" నిరుత్తరుడైనాడు. ఒకవేళ వాళ్ళ అమ్మమ్మ ఆరోగ్యం బాగాలేక రమ్మందేమో !" అని సమాధానపడబోయాడు.

కాని ఎందుకో అది కారణంగా కనిపించలేదతనికి. ఏమీ తోచక పిచ్చిగా ఉందతనికి. తిరిగి మరో రెండు కొపెక్లువేసి లేనియా ఇంటికి ఫోన్‌చేసాడు. లేనియా గురించి అడగ్గానే "ఆమె నీ హాస్టల్‌కి రాలేదా? ఈరోజు నీ రూంకి వెళ్తానంది" అని ఆమె తల్లి ఎదురుప్రశ్న వెయ్యగానే ఖంగారుతో నోటమాటరాక,

"రాలేదు ఏదన్నా పనివుండి హాస్టల్లోనే ఉండిపోయిందేమో!" అని ఫోన్ పెట్టేసాడు.

దీంతో ప్రదీప్‌కి పూర్తిగా మతిపోయినట్లయింది. లేనియా అమ్మమ్మ దగ్గర కెళ్తూ తల్లిదండ్రులకి చెప్పకపోవడమేమిటి? ఏమీ అర్థమవటం లేదతనికి.

రోజులొక్కటొక్కటే గడుస్తున్నాయి. రోజూ ప్రదీప్ లేనియా రాకకోసం ఎదురుచూస్తున్నాడు. ఆమె కోసం రోజూ ఫోన్ చేస్తున్నాడు. అప్పుడప్పుడు ఆమె హాస్టల్‌కి వెళ్ళి వస్తున్నాడు. కాని అతనికి నిరాశే ఎదురవుతోంది. క్షణాలు యుగాల్లా గడుస్తున్నాయతనికి. ఆమెకోసం తహతహలాడసాగాడు. ఏదో వెలితిగా ఉంటోందతనికి. ఆమె నిరీక్షణతో తన పిహెచ్.డి. వర్కు కూడా సరిగ్గా చెయ్యలేకపోతున్నాడు. దేనిమీదా దృష్టి పోవటంలేదు. ఏపనీ చెయ్యబుద్ధి కావటం లేదు. పిచ్చిగా ఆమె కోసం ఎదురుచూస్తున్నాడు.

"నేను భారతదేశానికి వెళ్ళినప్పుడు లేనియాకూడా నాలాగే బాధపడివుంటుంది. ఇలాగే నా కోసం పిచ్చిగా నిరీక్షించి ఉంటుందికానీ నేను లేనియాకు చెప్పి వెళ్ళేను. వెళ్ళినా వారానికి ఒక ఉత్తరం రాసేవాడిని. మరి లేనియా! చెప్పకుండా వెళ్ళిపోయింది. కనీసం ఒక్క ఉత్తరమన్నా రాయలేదు. ఒకసారి ఆమె సోచీకెళ్ళి వారంరోజులుండవలసి వచ్చింది. రోజూ రాత్రుళ్ళు ఫోన్ చేసేది. తన విరహాన్నంతా ఫోన్‌లో చెప్పేది. ముద్దుల వర్షం ఫోన్‌లోనే కురిపించేది. ఉత్తరాలుకూడా రాసేది. ప్లేన్ దిగీ దిగగానే

విమానాశ్రయంలోనే తనని పెనవేసుకుపోయేది. అలాంటి లేనియా వెళ్ళి నెళ్ళాళ్లు కావస్తోంది. ఇంతవరకూ ఒక్కసారైనా ఫోన్‌చెయ్యలేదు. వింతగా ఉంది."

లేనియా జ్ఞాపకాలు అతన్ని చాలా బాధిస్తున్నాయి. ఆ విరహాన్ని అతను భరించలేకుండా ఉన్నాడు. ఈ రోజన్నా వచ్చిందేమో చూసివద్దాం! అనుకుంటూ ఆమె హాస్టల్‌కి బయలుదేరాడు.

మంచి శీతాకాలపు రాత్రి తొమ్మిది దాటింది. చలికాలం కావడంతో బైట బాగా చలిగా వుంది.

టెంపరేచర్ మైనస్ మప్ఫైదాకా దిగిపోయింది. హాస్టల్సు ఊరికి చాలా దూరంగా వుండటంతో చుట్టూ ఖాళీగా వుండి అదంతా తెల్లటి మంచులో కప్పబడివుంది. నరాలు జివ్వుమనేటిగాలి. ఫర్‌కోటు, టోపీ, గ్లవుజులూ, ఫర్‌బూట్లూ వేసుకున్నా ఆగటంలేదా చలి. ముక్కులోంచి వచ్చే ఊపిరి ఆవిరిలా పొగలరూపంలో వస్తోంది. బుగ్గలు ఎర్రగా కందిపోతున్నాయి. శరీరం గడ్డకట్టుకుపోతోంది. అటువంటి వాతావరణంనుంచి అప్పుడే లోపలికి ప్రవేశించిన ప్రదీప్‌కి సెంట్రల్ హీటెడ్ హాస్టలు ఎంతో వెచ్చదనాన్ని కలిగించింది. ఒక్క క్షణం నిలబడి స్వేచ్ఛగా ఊపిరిపీల్చుకున్నాడు. లేనియా గది ముందుకు రాగానే గ్లవుజులు కోటూ టోపీ తీసి వాటిపైపడ్డ మంచుని దులిపి చేతిమీద వేసుకుని ఆమె రూం బెల్ నొక్కాడు.

"దాదా" అంటూ తలుపు తీసింది లేనియా. అతను పట్టలేని ఆనందంతో లోపలికివెళ్ళి లేనియాకి ముద్దివ్వబోయాడు. లేనియా ఒక్కడుగు వెనక్కివేసి ఛెళ్ళున దవడ బద్దలయ్యేలా ఒక్క లెంపకాయ కొట్టింది. ఎదురుచూడని ఈ సంఘటనకి ఖిన్నుడయి, లేనియావైపు వెర్రివాడిలా చూసాడు. ఆమె ముఖం కందగడ్డలావుంది. 'కళ్ళు నిప్పులు కురిపిస్తున్నాయా!' అన్నంత ఎర్రగా వున్నాయి. ముక్కుపుటాలు, పెదిమలు కోపంతో అదురుతున్నాయి. ఆ లెంపకాయతో ఆమె కోపం తీరినట్లులేదు. ఒక సెకను శ్వాస పీల్చుకుని "దురాక్, హరిగాన్" అంటూ రష్యన్‌లో తిడుతూ ఆ దవడా, ఈ దవడా వాయించసాగింది. ఇంతసేపూ చలితో బిగుసుకున్న నరాలన్నీ ఒక్కసారిగా వేడినందుకున్నాయి. ఏం జరుగుతోందో, ఎందుకో తెలియటంలేదతనికి. ఉగ్రురాలైపోతున్న ఆమెని చూస్తుంటే అతని కాళ్ళూ, చేతులూ వణకసాగాయి. ఖంగారూ, గాబరాతో ఆమెకేసి చూసాడు. ఈసారి మళ్ళీ కొట్టబోతున్న లేనియా చెయ్యి పట్టుకుని ఆపి "నీకు పిచ్చెక్కిందా?" అని మాత్రం అనగలిగాడు. "నాకు పిచ్చెక్కడంలేదు దుర్మార్గుడా! నీచుడా! నీ మోసబుద్ధి బైట పడింది. నీ పిహెచ్.డి. అయ్యాక నన్ను పెళ్ళిచేసుకుంటానన్నావు. నాలో ఎన్నో కోర్కెల్ని రేపావు. ఎన్నో ఆశల్ని

కలిగించావు. అన్నీ నిజమే అనుకుని నిన్ను నమ్ముకున్నాను. దగాకోర్! నన్నెంత మోసగించావు. పైగా ఏమీ తెలియని నంగనాచిలా నాటకమాడుతున్నావా?" అంటూ అరవసాగింది. అప్పటికికూడా ప్రదీప్‌కి ఏమీ అర్థంకాలేదు. "ఏంజరిగింది లేనియా ఏం మోసం చేసాను! నీకేం అన్యాయం చేసాను! నేనేం నాటకం ఆడేను? ప్లీజ్! నాకేం తెలియటంలేదు, చెప్పవా? చెప్పు లేనియా!" అంటూ ఆమెని బతిమాలసాగాడు.

"పాపం! ఏమీ తెలీదా? అయితే తెలుసుకో - చూడు!" అంటూ ఒక కవర్ని అతని మీదికి విసిరింది. ఆ విసరడంలో అందులోంచి ఒక ఫోటో జారి కిందపడింది. అంతే - అతని ముఖం వివర్ణమైంది. తడబడిపోయాడు. ఆ ఫోటోలో ప్రదీప్ మరో అమ్మాయి ఎదురెదురుగా నిలబడ్డారు. ప్రదీప్ ఆమె చేతిని తన ఎడంచేత్తో పట్టుకుని వేలికి ఉంగరం తొడుగుతున్నాడు. ఆ ఫోటోని వంగి తీసి కవర్లో పెట్టాడు. ఆమె కోపానికి కారణం అర్థమయింది. ప్రదీప్ దోషిలా తలదించుకున్నాడు. దాంతో లేనియా కోపం రెట్టింపయి మరీ రెచ్చిపోయింది.

"ఇప్పుడు చెప్పు - నన్నెందుకిలా మోసగించావో! ఇండియాకివెళ్ళి పెళ్ళి చేసుకొచ్చానని మాట మాత్రంగానైనా చెప్పలేదు - సరికదా తిరిగివచ్చి నాతో ఈ నాటకం ఆడుతున్నావు. నన్ను నీ చదువయ్యాక పెళ్ళి చేసుకుంటానని మాటిచ్చి ఎందుకింత దగా చేసావు? నా గొంతుకెందుకు కోశావు? నీ భార్య రాసిన ఉత్తరంకూడా చదివేను నీచుడా! ఇద్దర్ని మోసగిస్తున్నావన్నమాట!" అంటూ అరిచి అరిచి కోపమంతా తగ్గిపోగానే దుఃఖంగా మారి వెక్కెక్కి ఏడ్వసాగింది.

ప్రదీప్ నోటంట మాట రావటంలేదు. తన తప్పిదానికి సిగ్గుపడుతున్నాడు. "ఆ సాయంత్రం మోహిని ఫోటో పంపిస్తూ ఉత్తరంకూడా రాసింది. అది జేబులోనే వుంచుకుని లేనియా రూంకి వచ్చాడన్న మాట. ఉదయం బట్టలు మార్చుకునేటప్పుడు అది గదిలో జారిపోయివుంటుంది. అదే లేనియా కోపానికి కారణమని ఇప్పుడే తెలిసింది. తనా ఉత్తరం, ఫోటో విషయం మర్చేపోయాడు. పెట్లో పెట్టాననుకున్నాడు. ఎంత పొరపాటు జరిగింది!"

ప్రదీప్ ఇండియాకి వెళ్ళేటప్పటికే అతని తల్లిదండ్రులు అతనికోసం నాలుగైదు సంబంధాలు చూసి వుంచారు. అందులో ఒకటి చేసుకోవాలని చెప్పారు. అతనికి మోహిని నచ్చింది. ఆమెని చేసుకుంటానని చెప్పాడు. వెంటనే దగ్గర్లో ఉన్న ముహూర్తం చూసి పెళ్ళిచేస్తామన్నారు కానీ తను పిహెచ్.డి. అయితేగానీ చేసుకోనన్నాడు. వాళ్ళు మంచి రోజు చూసి తాంబూలాలు పుచ్చుకున్నారు. ప్రధానపు ఉంగరాలు మార్పించారు. అదయిన కొద్దిరోజులకే ప్రదీప్ తిరిగి మాస్కోకి వచ్చేసాడు. మోహినికి లేనియా

గురించిగానీ, లేనియాతో మోహిని గురించిగాని చెప్పలేదు. ఇద్దరికీ తెలియకుండా జాగ్రత్తగా ఎక్కడికక్కడే తప్పించుకుపోదామనుకున్నాడు. ఇండియాకి వెళ్ళేకా తన మర్యాద, సంస్కారానికి భంగం రాకుండా చూసుకోవాలనుకున్నాడు. అందుకే పిహెచ్.డి. అయ్యాక మోహినిని చేసుకుంటానన్నాడు. అంతదాకా ఈ రహస్యం పొక్కకుండా లేనియా దగ్గర జాగ్రత్తపడాలని అనుకున్నాడు. ఈ రహస్యాన్ని గుట్టుగా వుంచాలనుకున్నాడు. కానీ దొరికిపోయాడు. “దొంగతనం దాగదంటారు ఇందుకే” అనుకున్నాడు. కర్తవ్యం గురించి ఆలోచించాడు. “ఇప్పుడు ఇక్కడ నలుగుర్లో నవ్వులపాలు కాకూడదు. లేనియా ఏంచేసినా చెయ్యొచ్చు. వాళ్ళ దేశం వాళ్ళ మనుషులు,” అనుకుని లేనియా ప్రక్కగావెళ్ళి కూర్చున్నాడు.

“చూడు లేనియా! నామాట ఒక్కసారి వింటావా? నేను నీకు చెప్పేది పూర్తిగా విను. ప్లీజ్ -లే-లేచి కూర్చో!” అంటూ బలవంతాన ఆమెని లేవదీసి కూర్చోపెట్టాడు. లేనియా లేచి కళ్ళు తుడుచుకుని కూర్చుంది.

“చూడు లేనియా! నువ్వనుకున్నట్లు అది మా పెళ్ళిఫోటో కాదు. నేను ఇండియాకి వెళ్ళినప్పుడు మావాళ్ళు బలవంతం చెయ్యగా నిశ్చితార్థం మాత్రం చేసుకున్నాం. ప్రధానం సమయంలో ఉంగరం పెడతారు అది మా ఆచారం. అంత మాత్రంతో అది పెళ్ళికాదు. మావాళ్ళు బలవంతాన చేయించినపని నాకు ఏమాత్రం ఇష్టంలేదు. నన్ను నిర్బంధించి చేయించినపని. నా ఇష్టం మీద జరిగిందికాదు. అప్పుడు నీగురించి మావాళ్ళకి చెప్తే నన్ను తిరిగి మాస్కోకి రానివ్వరు. అట్టి పరిస్థితుల్లో తప్పనిసరిగా ఒప్పుకోవలసి వచ్చింది. అక్కడ ఏమీ చెప్పకుండా ప్రధానం చేసుకుని వచ్చేసాను. ప్రధానం అయినంత మాత్రాన పెళ్ళి చేసుకోవాలనిలేదు. పీటలమీద పెళ్ళిళ్ళే తప్పిపోతూవుంటాయి. ప్లీజ్ - నా మాట నమ్ము! నువ్వే నా భార్యవి! నిన్ను నేను పెళ్ళిచేసుకుంటాను. ఆ పిల్లంటే - నాకే మాత్రమూ ఇష్టంలేదు. ఆ ఉత్తరానికి జవాబే రాయలేదు అసలు దాని విషయమే గుర్తులేదు,” అంటూ లేనియా చేతులు పట్టుకుని బతిమాలసాగాడు.

అంతదాకా ఏడుస్తున్న లేనియా ఒక్కసారిగా నవ్వింది. లేనియా నవ్వులో నిర్లక్ష్యం, నిరాశా మిళితమైవున్నాయి. మామూలుగా లేచి కూర్చుంది. “ప్రదీప్! చూడు మీ భారతీయుల్లో ప్రధానమంటేనే సగం పెళ్ళి అయిపోయిందన్న మాట. నీ మాటెలా ఉన్నా ప్రధానం చేసుకున్న ఆ పిల్లని విడిచేసి నన్ను చేసుకుంటే ఆమె గతేమిటి? మీలో ప్రధానమయి తప్పిపోయిందంటే ఎంత అప్రతిష్ట! ఆమెకి మళ్ళీ వివాహమవడం కష్టం. ఆమెయే కాకుండా ఆమె కుటుంబీకులంతా కూడా నలుగుర్లో

నవ్వులపాలవుతారు. సిగ్గుతో తలెత్తుకుని తిరగలేరు. మీ ఆచారాలకి ఇప్పుడు నువ్వాడే మాటలు విరుద్ధంగా వున్నాయి. నువ్వు మగవాడివి. నీ మగబుద్ధి పోనిచ్చుకోలేదు. ఇంకా నీకు జ్ఞానం రాలేదనుకుంటా. అక్కడ ఆమె నువ్వు వెళ్ళేవరకూ నీకోసం నిరీక్షిస్తుంది. నువ్వే తన భర్తవనుకుంటుంది. నీతో తన జీవితాన్ని ముడేసుకుని, గాలి మేడలు కట్టుకుంటూ, ఊహాలోకాల్లో విహరిస్తూ వుంటుంది. నీ చదువయి, నన్ను పెండ్లాడి అక్కడికి తీసుకెళ్తే ఆమె మనని చూసి ఏమనుకుంటుంది? మీ దేశీయులు ఇలాంటి షాక్‌లని తట్టుకోలేక ఆత్మహత్యలు కూడా చేసుకుంటారని విన్నాను. చాలు చాలు దయచేసి ఈ డ్రామా ఇంతటితో ఆపి మీ దేశం వెళ్ళేకా మోహినిని పెళ్ళి చేసుకుని ఆమెకి న్యాయం చేకూర్చు. ఆమెని వివాహం చేసుకుని మీరిద్దరూ హాయిగా జీవించండి. ఇక నా విషయమంటావా! ఇన్నాళ్ళూ నీతో తిరిగినందుకు మా దేశీయులు మీ దేశంలోలాగ కులటననిగానీ, ఉంపుడుగత్తెనని గానీ అనరు. ఒకటి మాత్రం నిజం. నన్ను నమ్మించి, మోసగించి, నాలో అనేక ఆశల్ని రేకెత్తించి అవన్నీ వమ్ము చేసావు. అది నా జీవితంమీదే పెద్దదెబ్బ. భారతదేశంలోని స్త్రీలవలె నీతో కాపురం చెయ్యాలని నా మనస్సు కోరుకుంది. ఎంతో ఆశపడ్డాను. సరదా పడ్డాను. నన్ను దగా చేసావు. కానీ అవి నా ఒక్కర్తికే తెలుసు. మా దేశీయులకి నా మానసిక వేదన చెప్పినా అర్థంకాదు. పైగా నవ్వుతారు. హేళనచేస్తారు. పెళ్ళి చేసుకోదల్చుకుంటే నాకు మళ్ళీ పెళ్ళి కాకపోదు. నా జీవితానికీ, మోహిని జీవితానికీ ఇక్కడే పెద్ద వ్యత్యాసం. దయచేసి ఈనాటి లగాయతూ మరెప్పుడూ నా గదికి రాకు. ఈ క్షణం నుంచి నువ్వెవరో! నేనెవరో! మనం ఇక కలుసుకోవద్దు, వెళ్ళిపో ప్లీజ్. వెంటనే వెళ్ళిపో" అని అతనిచ్చిన ప్రెజెంటేషన్‌లన్నీ అతని ముందుంచింది.

అవి తీసుకుని తలదించుకుని ప్రదీప్ బైటికొచ్చేసాడు. లేనియా కొట్టిన దెబ్బలు చెంపలకే తగిలాయి. కానీ ఆమె అన్న ఒక్కొక్కమాట గునపపు పోట్లల్లా గుండెల్లో గుచ్చుకుని బాధిస్తున్నాయి. భారతదేశపు నైతిక విలువల్ని ఆమె చేత చెప్పించుకోవలసి వచ్చింది. భారతీయుల కట్టుబాట్లని ఆచార వ్యవహారాలని ఆమె దగ్గర నేర్చుకోవలసి వచ్చింది. తమ దేశం గురించి గొప్పగా చెప్పుకున్న విషయాలని ఆచరించమని బంగారం చెప్పుతో కొట్టి మరీ చెప్పింది. సిగ్గుతో కుంచించుకుపోసాగాడు. జీవంలేని ప్రాణిలా తన గదికి తిరిగి వచ్చాడు.

అతని మనస్సు ఏదో తప్పు చేసినట్లు బాధిస్తోంది. ఏ పనీ సరిగ్గా చెయ్యలేకపోతున్నాడు. త్వరగా చదువు ముగించి స్వదేశానికి వెళ్ళిపోవాలని

నిశ్చయించుకున్నాడు. ఆనాటి లగాయతూ ఏ ఇతర వ్యాపకాలూ, ధ్యాసా లేకుండా దీక్షగా పిహెచ్.డి. పూర్తిచెయ్యడానికే నిశ్చయించాడు.

అనుకున్నట్లు డాక్టరేట్ పొందాడు. అక్కడ మిగిలిన పన్లన్నీ ముగించుకొని స్వదేశానికి రావడానికి టిక్కెట్టు తీసుకున్నాడు.

సాయంత్రం ప్రయాణం. సామానంతా సర్దుకున్నాడు. మిత్రులందరి వద్ద వీడ్కోలు తీసుకున్నాడు. ఆ రోజంతా ప్రదీప్‌కి లేనియాయే గుర్తుకొస్తోంది. ఆఖరిసారిగా ఒక్కసారి చూడాలని పలకరించాలని అనిపిస్తోంది. కానీ ఫోన్ చెయ్యాలన్నా భయంగా వుంది. ఆ రాత్రి తరవాత ఆమెని మళ్ళీ కలవలేదు. ఎక్కడా ఎప్పుడూ ఎదురుపడలేదు. ప్రతీ లేడీస్ డేకి లేనియాకి మంచి కానుక కొని ప్రెజెంట్ చేసేవాడు. మొన్న "మార్చి తొమ్మిది" లేడీస్‌డే రోజున కూడా ఆమెకి చిన్న కానుక కొన్నాడు. మళ్ళీ వెంటనే ఆమె ఇండియానుంచి తెచ్చినవే తిరిగి ఇచ్చేసిందని గుర్తుకు రాగానే, ఇదీ వాటిలాగే తిరస్కరిస్తుందని ఆ ప్రయత్నం విరమించుకున్నాడు. ఆమె జ్ఞాపకాలన్నీ ఈ రోజు తన్ని మరీ బాధిస్తున్నాయి. ఫోన్ చెయ్యాలన్నా ధైర్యం చాలటం లేదు.

సాయంత్రం విమానాశ్రయానికి వెళ్ళేడు. ఇంకో అరగంటలో తను లోపలికి వెళ్ళిపోవాలి. అంతే అక్కడితో తను రష్యాని వదిలేసినట్టే – మళ్ళీ లోపలికి రానివ్వరు. గడియారం చూసుకున్నాడు. టైమవుతోంది. సామాన్లు తూపించుకున్నాడు. మిగతాసామాను వెంట తీసుకెళ్ళేవి తీసుకుని లేచాడు. ఇంతలో వెనక పాటున ఎవరోవచ్చి తన్ని రెండు చేతులతో గట్టిగా బిగించారు. వంగివున్న తనని వెనక నుంచే ముద్దుపెట్టుకున్నారు. చేతిలోని సామాన్లు వదిలేసి వెనక్కి తిరిగాడు. లేనియా...! ఆనందం, ఆశ్చర్యం రెండూ ఒకేసారి కలిగి నోటమాట రాలేదు. అచేతనంగా నిలబడ్డాడు. కళ్ళంట జలజలా అశ్రువులు రాలేయి. నెమ్మదిగా ఆమెని కౌగలించుకుని ముద్దుపెట్టుకున్నాడు.

టైమయిపోయింది. మైక్‌లో ఎనౌన్స్‌మెంట్ వినపడింది. సామాన్లు తీసుకుని లేనియాకేసి చూసాడు. ఆమె ఏడుస్తోంది. కళ్ళు తుడుచుకుని టాటా చెప్పింది. "మీ ఆవిడకి నా బెస్టు విషెస్ చెప్పు. మీ దాంపత్య జీవితం ఆనందంగా వుండాలని కోరుతున్నాను. ఒక స్నేహితురాలిగా నన్ను గుర్తుంచుకో!" అని రుద్ధమైన కంఠంతో చెప్పింది. ప్రదీప్ నోటంట మాటరావటంలేదు. గుండెలు బరువెక్కి పోయాయి. ఏవేవో చెప్పాలని, క్షమాపణ అడగాలని అతని మనసు కోరుతోంది. చెప్పలేని బాధతో ఆ మాటలు గొంతు పెగుల్చుకుని రాలేకపోతున్నాయి. తప్పు చేసానన్న సిగ్గుతో లేనియావైపు తలెత్తి చూడలేకపోతున్నాడు. అపరాధిలా తలదించుకుని లోపలికి వెళ్ళిపోయాడు. లేనియాతో గడిపిన కాలాన్ని, ఆమె సాహచర్యంలో కలిగిన

అనుభవాలని అనుబంధాన్ని, మాత్రం గుర్తుచేసుకుంటూ బరువుగా నడవసాగాడు. 'నాకూ, లేనియాకీ ఇంతటితో ఋణం తీరిపోయింద'నుకుంటూ ప్లేన్ ఎక్కాడు.

తిరిగి స్వదేశంలో అడుగిడిన ప్రదీప్‌కి సొంతవారి మధ్య, మిత్రుల మధ్య కాలం సరదాగానే గడచిపోవడంతో అతనికి పాత జ్ఞాపకాలు మరుగున పడ్డాయి. కొద్ది రోజులపాటు బంధువుల ఇళ్ళకి తిరిగి రావడంతో గతాన్నంతా పీడకలగా మర్చిపోయాడు. అతని జీవితం మామూలు గాడిలో పడసాగింది. అంతలోనే తను అప్లై చేసిన ఢిల్లీ ఉద్యోగం కూడా రావడంతో అతనికేకాకుండా అతని వాళ్ళందరికీ కూడా చాలా సంతోషాన్ని కలిగించింది. వారం రోజుల్లోనే జాయిన్ అవ్వాలన్నారు. వెళ్లేముందు తల్లిదండ్రులు, మోహిని తండ్రికి రాసి ముహూర్తం పెట్టించమంటామని చెప్పేరు. 'సరే' అని ఢిల్లీకి వెళ్ళిపోయాడు.

మంచి ఉద్యోగం, బాగానే వుంది. జీతం రెండువేల దాకా ఇస్తారు. ఇల్లూ, ఫోనూ ఇచ్చారు. ఒక్క భార్యలేని లోటు తప్ప మిగతా అన్నీ కూర్చుకున్నాడు. త్వరలోనే పెళ్ళయి మోహిని కూడా వచ్చేస్తే! తనెంత అదృష్టవంతుడు! డాక్టరేట్ పొందిన వెంటనే ఉద్యోగం వచ్చింది. చక్కటి భార్య రాబోతోంది. తన తాహతుకి తగ్గట్టు, తన తల్లీ చెల్లెళ్ళ ముచ్చట్లకి తగ్గట్టు మోహిని తండ్రి కట్నం పాతిక వేలూ, తల్లి, చెల్లెళ్ళ లాంఛనాలకి గాను అయిదు వేలూ ఇస్తున్నాడు. ఇదికాక ఇంటికి సామాను. తన అదృష్టాన్ని తల్చుకుని మురిసిపోసాగాడు. ముహూర్తం పెట్టి చెరో వుత్తరం నాకూ, నీకూ రాయమని మోహిని తండ్రికి ఉత్తరం రాసినట్లు ప్రదీప్ తండ్రి వద్దనుంచి ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరం కోసం వెయ్యి కళ్ళతో ఎదురుచూడసాగాడు.

సాయంకాలం ఆఫీసునుంచి వచ్చిన ప్రదీప్‌కి తోటి ఉద్యోగి ఆనంద్ తన తమ్ముడి పెళ్ళి రిసెప్షన్‌కి పిల్చిన విషయం గుర్తొచ్చింది. నిన్న కూడా అతను మరీ, మరీ రమ్మని చెప్పేడు. ఒంటరిగాఉన్న తనకీ కాస్త కాలక్షేపమవుతుందనుకుని చిన్న ప్రెజెంట్‌కొని పార్టీకి వెళ్ళేడు. ఆనంద్ గేటు దగ్గరే ఎదురయి స్వాగతం చెప్పి నూతన దంపతుల దగ్గరకి ప్రదీప్‌ని తీసుకెళ్ళేడు. ఆనంద్ తమ్ముడు సుకుమార్‌కీ, మరదలికీ పరిచయంచేసాడు. సుకుమార్‌కి షేక్ హేండ్ ఇచ్చి, మరదలి వైపు తిరిగి నమస్కారం పెట్టిన ప్రదీప్ రెండు సెకనులు చేష్టలుడిగి నిలబడిపోయాడు. తననితానే సంబాళించుకుని, పొరపడటం లేదుకదా? అని మళ్ళీ మరోసారి ఆమెవైపు చూశాడు. సందేహం లేదు ఆమె మోహినే! నిజంగా ఎంత మోసం! ఎంత దగా! తాంబూలాలు పుచ్చుకుని, కట్నకానుకలన్నీ మాట్లాడుకుని, ముహూర్తాలు పెట్టుకోవడం తరవాయిగా

అన్నీ నిశ్చయమైపోయాయి కదా? ఎంత దారుణం! అనుకుని పళ్ళు పిండుకున్నాడు. భగ్గున శరీరమంతా మండింది. మోహిని తనకేసి చూసి వెటకారంగా నవ్వడం ప్రదీప్ గమనించకపోలేదు. అతనికి తలకొట్టేసినట్లయింది. కోపం పట్టలేకపోతున్నాడు. ఆమెని లాగి లెంపకాయ కొట్టాలన్నంత ఆవేశం వస్తోంది. శరీరంలోని రక్తం కుతకుతా ఉడుకుతోంది. నిస్సహాయంగా, నిస్సత్తువగా, జీవంలేని ప్రాణిలా కొంచెంసేపు నిలబడిపోయాడు. ఆవేశంతో అక్కడ ఏం రసాభాస చేసినా తనే అవమానం పాలవుతాడు. పైగా అది సంస్కారుల లక్షణం కాదు అనుకుని, తెలివితెచ్చుకుని ఎవ్వరితో చెప్పకుండా బైటికొచ్చేశాడు.

ఇంటికొచ్చిన ప్రదీప్ మనఃక్లేశంతో పిచ్చివాడిలా ఆలోచించసాగాడు. 'ఇలా ఎందుకు జరిగింది? తాంబూలాలు పుచ్చుకున్నాకా మోహిని అప్పుడప్పుడు తనకి ఉత్తరాలుకూడా రాసేది. తనుకూడా జవాబు రాసేవాడు. తను ఇండియాకి వచ్చాకా ఆమె దగ్గరనుంచి ఉత్తరం లేదు. తనే తన విరహాన్నంతా ఒలకబోస్తూ ఆమెకి ఒక ఉత్తరం రాశాడు. అందులో త్వరగా ముహూర్తం పెట్టించమనీ, ఒక్కడినీ వుండలేకపోతున్నాననీ కూడా రాశాడు. దానికి జవాబు లేదు పైగా ఈరోజు తను మోహినిని పెళ్ళికూతురిగా, అదీ మరొకడి భార్యగా చూడటం తనకి పెద్ద షాక్ కొట్టినట్లయింది. అసలు విషయమేమిటో ఎంత ఆలోచించినా అర్థం కావటంలేదు.

ఈ పెళ్ళికొడుకు తనకంటే గొప్పవాడా అంటే అదీ కాదు. మరి ఏం చూసి అతన్ని చేసుకుంది? కారణమేమిటి? ఇదివరకే వారి మధ్య ప్రేమాయణం ఏమన్నా వుందేమో! అదే ఈ పెళ్ళికి దారితీసిందనుకుంటా? మరి అలా అయితే మొదట్లో తనతో పెళ్ళి చూపుల నాటకం అదీ ఏమిటి? తన్నెందుకు చేసుకుంటానందీ? అని తనే ప్రశ్నించుకుంటూ మళ్ళీ తనే జవాబులిచ్చుకుంటున్నాడు. ఆమె మీద కోపం, కసి, అసహ్యం అన్నీ ఒకేసారి కలగసాగాయి. ఈ మోసగత్తె పరువు తియ్యాలని నిశ్చయించుకున్నాడు. తన ఆశల్ని వమ్ము చేసిందన్న కసితో శరీరం ఉడికిపోతోంది. కక్షతో ఒళ్ళంతా మండిపోతోంది. 'నాకు చేసిన మోసానికి ఈ విషకుంభం సంగతి తేలుస్తా' అనుకున్నాడు మనసులో. కోపంతో నిమిష నిమిషానికీ ఆమెమీద కసి పెరగసాగింది. ఇంత మోసంచేసిన ఆమె సంసారాన్ని విచ్ఛిన్నం చెయ్యాలన్న పట్టుదల ఎక్కువ కాసాగింది.

ఆనంద్ ఆఫీస్ పనిమీద టూర్‌వెళ్ళిన టైంలో కావాలనే ఆ నూతన దంపతుల్ని పార్టీకి రమ్మని ఆహ్వానించాడు ప్రదీప్. మోహిని భయపడి తనింటికి రాకపోతే తనే

ఆ మర్నాడెళ్ళి, తనకి ఆమె రాసిన ప్రేమలేఖలు, ప్రధానమప్పుడు తీయించుకున్న ఫోటో తీసుకెళ్ళి ఆమె భర్తకి ఇవ్వాలని నిశ్చయించుకున్నాడు. అన్నీ తీసి జాగ్రత్త చేశాడు.

'ఈ దెబ్బతో ఆమె నాటకం బైటపడుతుంది. సుకుమార్‌కి ఆమెపట్ల అసహ్యం కలుగుతుంది. ఇద్దరిమధ్య కలతలు వచ్చి విడాకులు పుచ్చుకోవాలి. అప్పుడు తన కసి తీరుతుంది. ఆమె జీవితమలాగే నాశనం కావాలి. తనలా ఎందరితో ఈ నాటకం ఆడిందో' అనుకున్నాడు.

సాయంత్రం ఆరు దాటింది. ఇంటి ముందు ఆటో ఆగింది. మోహినీ, సుకుమార్‌లు దిగారు. ప్రదీప్ ఆలోచనలు తల్లక్రిందులయ్యాయి. ఆమె సాహసానికి చకితుడయ్యాడు. మళ్ళీ మరోసారి ఆమె ముందు తనే ఓడిపోయినట్లు ఫీలయ్యాడు. ఇద్దర్నీ సాదరంగా లోపలికి ఆహ్వానించాడు. లోపల కూర్చోగానే నౌకరు కూల్‌డ్రింకులు తెచ్చాడు. ప్రదీప్ గర్వంగా సోఫాలో కూర్చుంటూ 'నా హోదా చూశావా?' అన్నట్లు ఆమె కేసి చూశాడు.

తన ఇల్లు, ఫర్నిచరు, నౌకర్లనీ చూసి ఆమె అసూయపడాలని, ఇంత మంచి సంబంధాన్ని కాలదన్నుకున్నందుకు బాధపడాలని అనుకున్నాడు. అందుకే తను తెచ్చిన ఫారిన్ సామానంతా చక్కగా హాల్లో సర్దివుంచాడు. ఆమె తన సామాను హోదా చూసి అసూయపడాలనుకున్నాడు. ఇంతటి అదృష్టాన్ని పోగొట్టుకున్నందుకు, ఒక సామాన్యపు ఉద్యోగస్తుడి భార్యనయినందుకు బాధపడాలనే ఆ రోజు మరీ డాబుగా, పటాటోపంగా అన్ని ఏర్పాట్లు చేయించాడు.

పార్టీ ఖరీదైన మూడు స్వీట్లు, మూడు హాట్లతో చాలా ఘనంగా ఏర్పాటు చేశాడు. గదిలోంచి టేప్ రికార్డర్‌మీద రష్యన్ మ్యూజిక్ హాయిగా వినిపిస్తోంది. పార్టీ అయ్యాక ఐస్‌క్రీం, డ్రైఫ్రూట్స్ తెచ్చి పెట్టేడు. ఇవన్నీ ఖరీదైన ఫారిన్ బేకరీల్లోంచి తెప్పించాడు. విందు ముగిసింది. బైట తోటలో కుర్చీలు వేయించి వారితో వెళ్ళి కూర్చున్నాడు. 'అసలు విషయం ఎలా ప్రారంభించడమా?' అని ఆలోచిస్తున్నాడు.

"ప్రదీప్‌గారు ఏదో ఆలోచనలో పడ్డట్టున్నారే! సడన్‌గా సీరియస్ అయ్యారు" అంది నవ్వుతూ మోహిని. ప్రదీప్ ముఖం కందగడ్డలా ఎర్ర బడింది. అది అవకాశంగా తీసుకుని, మోహిని ఇలా ఎదురుదెబ్బ కొడుతుందనుకోలేదు.

"నిజమే మోహినిగారూ! మీరు మంచి సైకాలజిస్టులాగున్నారే! మనుషుల్ని చాలా బాగా చదువుతున్నారు. నిజంగా మీ గురించే నా ఆలోచనంతాను. మీరు నన్నే కాకుండా,

ఇలా ఇంకెందర్ని మోసం చేశారా? అని ఆలోచిస్తున్నాను. మగవాళ్ళు స్త్రీలని మోసం చేస్తున్నారని, మీ ఆడవాళ్ళకి అన్యాయం చేస్తున్నారని దుయ్యబడుతున్నారు. మీవంటి ఆడవాళ్ళు మాలాంటి ఎందరి జీవితాలతో ఆటలాడి, ఎన్ని కుటుంబాలకి తలవంపులు తీసుకొస్తున్నారో ఒక్కసారి తెలుసుకుంటే అలా దుయ్యబట్టే వారు కాదేమో! ప్రధానం అయి మాటలన్నీ అయి, ముహూర్తాలదాకా వచ్చిన పెళ్ళిళ్లు, ప్రేమలేఖలు రాసి ఫోటోలు తీయించుకున్న పెళ్ళిళ్ళు మీకు ఎన్ని జరిగాయా? అనీ, నిశ్చయమైన సంబంధాలనే కాకుండా, పెళ్ళయిన భర్తల్ని కూడా మారుస్తూ వుంటారా! అనీ ఆలోచిస్తున్నానండీ!" అన్నాడు వెటకారంగా నవ్వుతూ.

"ఏమిటండీ మీరంటున్నది? ఎవరి గురించి? ఏం జరిగింది?" అన్నాడు సుకుమార్ ఇద్దర్నీ ఆశ్చర్యంగా చూస్తూ.

"మిస్టర్ సుకుమార్! మీ ఆవిడ ఎలాంటి మోసకత్తో మీకు తెలియదనుకుంటాను చెప్తాను వినండి –"

"నేను ఎమ్మెస్సీ పూర్తిచేసి శలవులకి ఇండియాకి వచ్చినప్పుడు మీ భార్యతో నాకు ప్రధానం జరిగింది. ఇద్దరం ఉంగరాలు మార్చుకున్నాం. అప్పుడే పెళ్ళి చేసేస్తానంటే డాక్టరేట్ పొందేకా చేసుకుంటానన్నాను. ఈ మధ్యకాలంలో మీ శ్రీమతి ప్రేమలేఖలు రాసేది. తిరిగి వచ్చాకా ముహూర్తాలు పెట్టించమని మావాళ్లు ఉత్తరం రాస్తే జవాబు లేదు. మొన్న పార్టీలో ఈమెని మీ భార్యగా చూశాను. కావాలంటే చూడండి, చదువుకోండి" అంటూ ఆమె రాసిన ఉత్తరాలని, పంపిన ఫోటోనీ జేబులోంచి తీసి అందించాడు.

"శరీరంలో ఏమాత్రం చీమూ, రక్తం ఉన్న మగవాడయినా, ఏమాత్రం పౌరుషమున్న పురుషుడయినా ఈ ఉత్తరాలని చదివి ఇలాంటి మోసగత్తెతో, వంచకురాలితో కాపురం చెయ్యడు" అంటూ ఆవేశంతో చెప్పుకుపోతున్నాడు.

అంతదాకా ఎంతో ఓర్మి, శాంతంతో విన్న మోహిని చిరునవ్వు నవ్వుతూ, "ప్రదీప్‌గారూ! మోసగత్తెని, వంచకురాలిని నేనో, మీరో! ఒక్కసారి ఇలా చూడండి" అంటూ పర్సులోంచి కార్డుసైజు ఒక ఫోటోని తీసి అతని ముందున్న బల్లమీద పెట్టింది.

గబుక్కున వంగి ఆ ఫోటోని అందుకుని చూశాడు. ముఖం వివర్ణమైంది. తడబడిపోతూ వాళ్ళిద్దరివైపూ చూశాడు. అవమానంతో తల వంచుకున్నాడు. అది మాస్కోలో ఒక భారతీయుల ఇంట్లో వారి కుటుంబంతో తీయించుకున్న ఫోటో.

అందులో వారి కుటుంబంతోపాటు తనూ, లేనియాకూడా ప్రక్కప్రక్కన చెట్టాపట్టా లేసుకుని నిలబడి వున్నారు. ఒకరోజు వాళ్ళింటికి డిన్నర్‌కి వెళ్ళినప్పుడు ఆ ఇంటి యజమాని కొన్ని ఫోటోలు తీశారు. అప్పటిదే ఆ ఫోటో. తను మాస్కోకి వెళ్ళిన రెండేళ్ళ తరువాత వాళ్ళు ఇండియాకి తిరిగివచ్చేశారు. తనకి అసలా విషయమే గుర్తులేదు. అదీకాకుండా "ఆ ఫోటో మోహినిదగ్గరకెలా వచ్చింది? ఎవరిచ్చారు? లేనియాగానీ పంపిందా?" అని ఖంగారు పడసాగాడు. చెమటలు పట్టసాగాయి.

అతని తొట్రుపాటు చూసి -

"ఇప్పుడు చెప్పండి ప్రదీప్‌గారూ! మీరన్నవన్నీ నాకే వర్తిస్తాయో, మీకే వర్తిస్తాయో! ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకుంటే బాగుంటుంది. ఎదుటివారిని నిందించేముందు, తమ తప్పిదాలని గుర్తుచేసుకుంటే మంచిది. ఇది నాదాకా ఎలా వచ్చిందనికదూ? మీ సందేహం? మీ కంగారు ఆశ్చర్యం!"

"నెల్లాళ్ళక్రితం అనుకుంటా - నేనూ, నా ఫ్రెండు నీలిమా కలిసి ఆమె దూరపు బంధువులింటికి వెళ్ళాం. వాళ్ళు మాస్కోలో మూడేళ్ళు వుండి వచ్చినట్లు వాళ్ళింటికి వెళ్ళేక తెలిసింది. వాళ్ళింట్లో కూర్చున్న కాస్సేపూ ఆమె మాస్కో విశేషాలు చెబుతుంటే విన్నాం. కొంతసేపటి తరువాత ఆమె టీ తెస్తానని లోపలికెళ్ళింది. నీలిమ కూడా ఆమెననుసరించింది. ఏం తోచని నేను అక్కడే బల్లమీదున్న వాళ్ళ ఆల్‌బమ్‌లు చూస్తూ కూర్చున్నా. అది వాళ్ళు మాస్కోలో తీయించుకున్న ఫోటోలు ఉన్న ఆల్‌బమ్. ఇంతలో ఆమె టీ తీసుకుని వచ్చింది. నేను ఆ ఫోటోల గురించి వివరాలు అడిగాను. ఆమె వాటిని వర్ణిస్తూ చెప్పింది. రెడ్‌స్క్వేర్‌లోనూ లెనిన్ మౌజులియం దగ్గర, మాస్కో రివర్ దగ్గర, వెదిన్‌హా అనే పర్మనెంట్ ఎగ్జిబిషన్ లోనూ, పెద్ద పెద్ద భవనాలముందు, పెనోరమాలోనూ మంచులో ఫర్‌డస్‌లలో తీయించుకున్న ఫోటోలు కలర్‌వీ, మామూలువీ వున్నాయి. ఆ తరువాత వాళ్ళింట్లో పార్టీలప్పుడు తీసిన కొన్ని ఫోటోలున్నాయి. అవి చూస్తున్న నా దృష్టి ఒక ఫోటోదగ్గర ఆగిపోయింది. అదే ఈ ఫోటో. నా మెదడు మొద్దుబారిపోయింది. కళ్ళు తిరిగిపోయాయి. నెమ్మదిగా సర్దుకున్నాయి. నన్ను నేను నిగ్రహించుకున్నాను. ఆ ఫోటోలోని రష్యన్ అమ్మాయిని చూపించి ఎవరని అడిగాను. ఆమె ప్రక్కనున్న అబ్బాయి గర్ల్‌ఫ్రెండని, అతని పేరు ప్రదీపని, మాస్కోలో ఎమ్మెస్సీ చదువుతున్నాడని, వాళ్ళిద్దరూ చదువయ్యాక పెళ్ళి చేసుకుంటారని, ఈపాటికి పెళ్ళయిపోయే ఉంటుందనీ చెబుతూ అక్కడి విద్యార్థులు మాస్కోలో చదువుకుంటూ ఒక గర్ల్‌ఫ్రెండుని కూడా పెట్టుకోడం మామూలనీ, వాళ్ళు

అక్కడ వున్నన్నాళ్లూ భార్యా భర్తల్లాగే వుంటారనీ, కొందరు తిరిగివచ్చేముందు వదిలేసి వస్తారనీ, కొందరు పెళ్ళిచేసుకుని తీసుకొస్తారనీ చెబుతూ అక్కడి రష్యన్‌ల పద్ధతులు, పెళ్ళిళ్ళు, విడాకులగురించి, వారి జీవితాల గురించి ఎన్నో విషయాలు చెబుతుంటే ఎంతో ఆసక్తితో విన్నాను.

"అయితే ప్రదీప్ లేనియాని ఇండియాకి తీసుకొస్తారా? ఆమె మన దేశంలో వుండగలదా?' అని నేనే అడిగాను నా ఆత్రుత కప్పిపుచ్చుకుంటూ.

దానికి ఆమె లేనియా గురించి ఎంతో గొప్పగా చెబుతూ, ఆమెకి భారతదేశం అంటే ఉన్న ప్రేమ అభిమానం గురించి చెప్పి ఆమె అక్కడే భారత నారీమణిలా వుండాలని మన పద్ధతుల్ని అలవర్చుకుందనీ, ఒక భారతీయ గృహిణిలా అక్కడే ప్రదీప్‌తో కాపురం చేస్తోందనీ, ప్రదీప్ కోసం తమ దేశపు అలవాట్లనీ, పద్ధతుల్నీ పూర్తిగా మార్చుకుందని చెప్పి, ఈపాటికి తప్పకుండా వాళ్ళు పెళ్ళి చేసుకుని వుంటారని, లేనియా భారతదేశంలో ప్రదీప్‌కి భార్యగా వచ్చి ఒక తెలుగు వారి కోడలుగా పేరు తెచ్చుకోవాలని మన తెలుగు పద్ధతుల్ని అలవర్చుకుందనీ, భారతదేశానికి రావాలని ఎంతలా ఉవ్విళ్లూరుతోందో చెప్పి లేనియాని తెగపొగడసాగింది. ఆమె మాటలు నాకు ఆనందం, ఆశ్చర్యం కూడా కలిగించాయి. ఆమె అంటే నాలోనూ సద్భావం ఏర్పడింది. కానీ ఆ ప్రక్కనే కృత్రిమపు ప్రేమ, కపటనాటకం ఆడుతున్న ఆ పురుషుని ఫోటో చూడగానే ఎక్కడలేని జుగుప్సా కలిగింది. అంతలా ప్రేమించిన అమాయకపు లేనియాలో ఎన్నో ఆశల్ని రేపి, కపటనాటకం ఆడుతూ మోసగించిన ఈ మనిషిని చూడగానే చెప్పలేని అసహ్యం, కోపం ఒకేసారి కలిగాయి. ఈ మోసగాడితోటే నాకు ప్రధానమయిందని గుర్తుకు వచ్చిన వెంటనే వేలినున్న ప్రధానపు ఉంగరాన్ని అక్కడే ఊడదీసి పర్సులో పడేశాను. ఆ క్షణంలోనే ఆ తాంబూలాలు రద్దయినట్లు నా మనస్సులో నిశ్చయించుకున్నాను. అంతే మీకూ, నాకూ ఆనాటితో సంబంధం తెగిపోయింది. ఇవన్నీ చెబితే నమ్మరని చివరగా ఉన్న ఈ ఫోటోని వాళ్ళ ఆల్‌బమ్‌లోంచి చెప్పకుండా తెచ్చి దాచాను. ఇప్పుడు చెప్పండి – పదిమంది జీవితాలతో ఆడుకునేది మీరా? నేనా?"

రష్యా నుంచి తిరిగిరాగానే నాకోసం పరితపిస్తున్నానని, త్వరగా ముహూర్తం పెట్టించమనీ రాసిన ఉత్తరం చూసిన నాకు మీ అసలురంగు బయటపడింది. మీ నాటకం అర్థమయింది. మీకు గుణపాఠం నేర్పాలని నిశ్చయించుకున్నాను. విదేశాలలో సంపాదించే డిగ్రీలతోపాటు అక్కడి దొరసాన్లు కావాలి. చదువులకోసం వెళ్ళిన

మీలాంటి వాళ్ళు క్షణంలో వారి పద్ధతుల్ని అలవర్చుకుని వారిలా మారిపోతారు. అక్కడ తెల్లవాళ్ళ కోసం ఎగబడతారు. పర్మనెంట్ భార్యలు కారుకదా అన్న ధైర్యంతో అందినవారినల్లా అందుకోజూస్తారు. ఆడవారు ఇంపోర్టెడ్ వస్తువులకోసమే మోజుపడతారు. మీవంటి మగవాళ్లు ఇంపోర్టెడ్ ఆడవాళ్ళ కోసం ఎగబడతారు. ఫ్రీగా వచ్చేవారినల్లా రుచి చూసివస్తారు. మళ్ళీ స్వదేశానికి తిరిగిరాగానే మాత్రం పెళ్ళి చేసుకుని కాపురం చెయ్యడానికి స్వదేశీ సరుకు, స్వచ్ఛమైన భారత స్త్రీ మన సంస్కృతి సంప్రదాయాలు గల భార్య కావాలి. ఆ ఇంపోర్టెడ్ భార్యని తెచ్చుకుని వెంట తిప్పుకోవడం ఇక్కడ మీ గౌరవానికి మీ కుటుంబ మర్యాదకీ భంగంకదా! అందుకు అక్కడివారినక్కడే వాడుకున్నన్నాళ్లూ వాడుకుని వచ్చేముందు వదిలి ఇక్కడి అమ్మాయిని పెళ్ళాడి భారతీయ సంప్రదాయానికి భంగం కలగకుండా కాపాడుకోవాలని కోరుకున్నారు పాపం! ఇక్కడ మీవాళ్లు ఫారిన్ డిగ్రీ కొడుకుని మార్కెట్లో పెట్టి వేలసంఖ్యలో బేరాలాడారు. సారే, చీరలే కాకుండా ఇంటిల్లిపాదీ ముచ్చట్లూ తీరే లాంఛనాల కోసం అత్తా, ఆడబిడ్డలూ, కలలుగన్నారు. ఇవన్నీ ఆ విదేశీయులు తేరు. ఆ ముచ్చట్లన్నీ తీర్చడానికి పెద్దింటి భారతదేశపు పిల్ల కావాలి. అందుకే చొక్కా విప్పి పారేసినట్లు ఆమెనక్కడే వదిలేసి ఇక్కడికొచ్చి నన్ను వివాహమాడి మీ కోరికల్ని తీర్చుకోవాలనుకుంటున్నారు కదూ. ప్రదీప్‌గారూ! ఒక్కటి తెలుసుకోండి పూర్వకాలం కాదు, తాంబూలాలు పుచ్చుకున్న సంబంధాలు తప్పిపోతే ఇక ఆడదానికి పెళ్ళి కాదనుకోడానికీ ఆమె భవిష్యత్తు నాశనం అయిపోతుందనుకోడానికీనూ! పీటల మీద పెళ్ళిళ్ళు తప్పిపోయిన వారికీ భర్తలు విడిచేసిన స్త్రీలకీ భర్తృ విహీనలకీ కూడా కావాలంటే తిరిగి వివాహాలయ్యే రోజులు వచ్చాయి. తాంబూలాలు పుచ్చుకోగానే భార్యాభర్తలయిపోరు. మనసులు కలిసి మనసారా ప్రేమించుకున్నవారే నిజమైన భార్యాభర్తలు. వారికి పుస్తె అనే లైసెన్సు అక్కరలేదు. పుస్తె కట్టకపోయినా లేనియాతో అక్కడ కాపురం చేశారు. ఆమెలో ఎన్నో ఆశల్ని రేకెత్తించారు. మీ మాటలతో నమ్మించారు. ఆమె అందరిలా కాకుండా ఎంతగానో, మిమ్మల్ని ప్రేమించిందని విన్నాను. అక్కడున్నన్నాళ్ళూ భార్యాభర్తల్లాగే మెలిగారని తెలిసి అక్కడి అందరితో మీరు "కాబోయే భార్యా భర్తలం" అనీ "త్వరలో పెళ్ళి చేసుకుంటామనీ" చెప్పేవారుట. అందుకు నా ఉద్దేశ్యంలో లేనియాయే మీ భార్య. మీరు ఆమెని తెచ్చుకుని ఆమెతోటే కాపురం చెయ్యండి. మీమీద ఎన్నో ఆశల్ని, ఆశయాలనీ పెంచుకున్న ఆమెని మోసగించి నిరుత్సాహ పర్చకండి. విదేశాల కెళ్ళి అక్కడ వారి పద్ధతుల్ని, వారి ఆచారాలని అనుసరించి ఇక్కడికొచ్చి మళ్ళీ మన ఆచారాలని కోరే వ్యక్తులంటే నాకు ఏ మాత్రం గౌరవం లేదు. మీరు అక్కడ లేనియాకి అన్యాయం చేసి మోసగించారు.

ఇక్కడ నా గొంతు కొయ్యాలని చూసారు. మీ తల్లిదండ్రుల దగ్గర ఎంతో బుద్ధిమంతుడిలా నటించి వారు చెప్పిన సంబంధాన్ని చేసుకున్నానన్న బిరుదుపొందాలని తాపత్రయపడ్డారు. ఇకనయినా మీ నాటకాన్ని ఇంతటితో కట్టిపెట్టి మీ తల్లిదండ్రులకి నిజానిజాలు తెలియజేసి మీ కోసం కొన్నేళ్ళు తన సర్వస్వాన్నీ అర్పించిన ఆ లేనియాని భార్యగా తెచ్చుకుని మీకు భార్యగా భారతదేశానికి రావాలనుకున్న ఆమె కోరికని తీర్చండి. మనం భారతీయులం. మనకి విదేశీయులిచ్చే గౌరవాన్ని మనం నిలబెట్టుకోవాలి. ఇకనైనా కళ్లు తెరచి మరే ఆడదానిపట్లా అలా ప్రవర్తించకుండా ఆమెనే వివాహమాడండి. మీరు మా పెళ్ళి పార్టీలో నన్ను కోపంగా ఛూడటం స్పెషల్‌గా మా బావగారు లేని టైములో ఈ పార్టీకి పిలవడం, ఇవన్నీ ఇందుకేనని గ్రహించా. నా మీద కసి తీర్చుకోడానికి వేసిన ప్లానని తెలుసుకున్నాను. అన్నీ ఊహించే ఈ ఫోటోని పర్సులో వేసుకుని వచ్చాను. మిమ్మల్ని చూసిన తర్వాతే మా వారితో మీ గురించి చెప్పాలనుకొన్నాను. కానీ మా అమూల్యమైన రాత్రిని మీవంటి మోసకారుల కథలతో పాడు చేసుకోదల్చుకోలేదు. స్త్రీకి కావలసింది భర్త ప్రేమ, అనురాగం కానీ డబ్బా, హోదా కాదు. అందుకే నేను ఈయన్ని ఎంచుకున్నాను. మా జీవితం ఎంతో హాయిగా వుంది. మీ జీవితాన్ని కూడా మిమ్మల్ని ప్రేమించిన ఆ లేనియాతోటే ఆనందంగా, హాయిగా అనుభవించమని ఒక ఆడదానిగా ఆమె మనసునెరిగి చెపుతున్నాను."

"సారీ! మరి వస్తాం. చాలా టయిమయింది. రండి సుకుమార్ ! మనం సెకండ్ షోకి వెళ్ళాలనుకున్నాం కదూ" అంటూ లేచింది మోహిని. సుకుమార్ కూడా "నమస్తే సార్ ! వస్తాం" అంటూ మోహినిని అనుసరించాడు.

మోహిని పలికిన ప్రతి ఒక్కమాట ఒక్కొక్క కొరడా దెబ్బలా తగిలాయి. వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు. లేచి గేటుదాకా సాగనంపాలనుకొన్నాడు. కాని లేవలేకపోయాడు. ఆమె అన్న ప్రతీ ఒక్క మాటలో యథార్థం వుంది. నిజంగా ఎంతో మోసం ఎంతో దగా చేసాడు. ఒకరిని కాదు. మోహిని చెప్పినట్లు లేనియాకి ద్రోహం చేసాడు. ఇటు తన వాళ్ళ దగ్గర బుద్ధిమంతుడిలా నటించీ మోసం చేశాడు. మోహినిని మోసగించబోయాడు. మోహిని తన కళ్ళు తెరిపించింది. నిజమే! లేనియా ఎంతలా బాధపడివుంటుందో! నిజంగా ఆనాడు తనింతలా ఆలోచించలేదు. అసలు పట్టించుకోనే లేదు. ఈ రోజు నిజంగానే ఆమెకోసం బాధపడుతున్నాడు. ఆమెకి అన్యాయం చేసినందుకు సిగ్గుపడుతున్నాడు. ఆమె ఎంత మంచి హృదయంతో మోహినిని పెళ్ళాడి హాయిగా ఉండమని కోరింది. భారతదేశపు నైతిక విలువల్ని బోధించింది. కానీ

తనే! ఆమెని మోసం చేశాడు. మోహినిని మోసగించబోయాడు. మోహిని తనకి బుద్ధిచెప్పి తనలో చైతన్యాన్ని కలిగించింది. ఆనాడు విమానాశ్రయం దగ్గర ఆమె రూపం మనసులో మెదిలింది. ఆమె ఆడిన మాటలు గుర్తొచ్చాయి. ఎంత ఆవేదనతో తనకు వీడ్కోలిచ్చిందో గుర్తుకు రాగానే కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. బరువుగా, బాధతో కూడుకున్న హృదయంతో భారంగా లేచి లోపలికి వెళ్ళేడు. మొదటగా తండ్రికి తన మాస్కో చరిత్రంతా ఒక ఉత్తరంగా రాశాడు. లేనియాని పెళ్ళి చేసుకుంటానని, ఆమెయే తన భార్య అనీ ఖచ్చితంగా రాసేశాడు. రెండో ఉత్తరం లేనియాకి రాశాడు. మొదట తన తప్పిదానికి క్షమాపణ చెప్పుకున్నాడు. మోహిని తనకి బుద్ధిచెప్పి తన కళ్ళు తెరిపించిందని రాశాడు. త్వరలోనే తను మాస్కో ట్రెయినింగుకి రావలసి వుంటుందని, అప్పుడు నిన్ను వివాహమాడి భారతదేశానికి తీసుకొస్తానని రాశాడు.

రెండు ఉత్తరాలనీ పోస్టు చేసి తేలికయిన మనస్సుతో తిరిగి ఇంటికొచ్చాడు. మంచంమీద పడుకున్న ప్రదీప్ మస్తిష్కంలో పట్టపగ్గాల్లేని ఆలోచనలు పరుగెత్తసాగాయి. "లేనియాకి ఈ ఉత్తరం అందగానే ఏం చేస్తుంది? ఎలా ఫీలవుతుంది! నన్ను వివాహమాడటానికి అంగీకరిస్తుందా? 'నేను సీతని నువ్వు రామ్‌వి' అనే లేనియా ఇంకా తననే తల్చుకుంటూ భారతీయ స్త్రీలలాగే 'ప్రదీప్‌కి నా మనసిచ్చాను, అతనే నా భర్త, మరెవ్వరినీ వివాహమాడలేను' అని అనుకుంటూ వుంటే తప్పకుండా నాతో వచ్చేస్తుంది. తప్పకుండా వస్తుంది" అనుకుంటూ నిద్రలోకి జారుకున్నాడు.

ఆంధ్రభూమి మాసపత్రిక

అక్టోబర్ 83